

# టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## మంత్రుడు - ద ఫినాలే...

*(ఇది పూర్తిగా అర్థం కావాలంటే ,క్రిందటి నెల ఎపిసోడ్ మరో సారి చదవండి..!)*

"చెప్పు నీకు ఏ చిప్ పెట్టమంటావు?" వాణ్ణే అడిగాను.

"లేస్ పొటాటో, సోర్ క్రీం అండ్ ఆనియన్.." అన్నాడు కంప్యూటర్ గొంతుతో.

"ఎహె, ఆ చిప్పు కాదు, సరే, నీకు ప్రస్తుతానికి బేసిక్ చిప్ పెడతాను, ఉండు పైకెళ్ళి తీసుకొస్తాను. " అని పైకొచ్చాను.

వైకుంఠంలో బ్రహ్మగారు అమ్మా, నాన్నతో కలిసి రమ్మీ ఆడుతున్నారు. ఉన్నట్టుండి మిడిల్ డ్రాపు చేసేసారు "ఇంక నేనెందుకూ.." అంటూ.

"ఏమైంది నాన్నగారూ.." అంటూ కంగారుగా అడిగాడు అటుగా వచ్చిన నారదుడు.

"వాడెవడో భూలోకంలో మనిషిని చేసేసాట్ట, స్పందనలు కూడా తగిలించేస్తున్నాట్ట, నా ప్రమేయం లేకండానే. " అన్నారు కోపంగా.

"ఓహో, వాడా, మరేం పర్లేదు నాన్నగారూ, అవన్నీ వాటంతట అవే నాశనమైపోతాయి, లాస్ట్ రీల్ లో" అన్నాడు నారదుడు నాలిక్కరచుకుంటూ.

చాటుగా విన్న ఇంద్రుడికి భయం పట్టుకుంది. ఎందుకేనా మంచిదని సీనియర్ మేనేజర్ మేనకని ఇచ్చి, ఒక (లే)టెస్ట్ బేచ్‌ని పంపించాడు. వాళ్ళొచ్చి మంత్రుడి ముందు అన్ని ఐటెం సాంగ్స్ కీ డేన్స్‌లు చేసి చేసి అలిసిపోయి, నీరసవొచ్చి దీనంగా చూస్తున్నారు.

చివరగా ఓ కుర్ర ట్రయినీ మొదలెట్టింది కాస్త వళ్ళు వంచి.."నీక్కావలసిందీ..., నా దగ్గర వుందీ..." అంటూ. ఊ..హూ. లాభంలేదు. చూసి చూసి మేనకకి విసుగొచ్చింది.

"ఒసే పిచ్చి మొద్దూ. నీక్కావలసింది వాడిదగ్గర లేదే, పద పోదాం.." అనేసి అందర్నీ తీసుకుని మాయమైపోయింది.

కిందకొచ్చిన నేను చిప్ తగిలించేసాను.

" ఇనుము విరిగెనే, స్పందన అతికెనే, ఆకాశంలో గులాబీ, పుల్లారెడ్డి జిలేబీ.." అంటూ మొదలెట్టేసరికి "రేయ్... ఆపరా నాయనా..." అంటూ అరిచాను.

"సారీ. మరిచాను, నేను మీకు విధేయుడనై..."

"రే.....య్.. ఈ భాషేంట్రా, వదిలేయరా బాబూ..."

"సారీ, సారీ, పదండి పైకి పోదాం, మాంఛి వాసనలొస్తున్నాయి..." అనేసి ఒక్క జంపులో పైకెళ్ళిపోయాడు. నేను మెట్టు మెట్టూ ఎక్కి వచ్చేసరికి వాడప్పుడే మజ్జిగా అన్నంలో ఉన్నాడు. టేబుల్ మీద మూకుడొక్కటే ఉంది, లోపల ఒఖ్ఖటంటే ఒఖ్ఖ ముక్క ఉంటే ఒట్టు. నేను దీనంగా ఇల్లాలికేసి చూసాను.

"పోన్లెండీ, బండెడు చాకిరీ చేస్తున్నాడు. నోరూ వాయా లేదు వెర్రి నాగన్న కి. మీకు మళ్ళీ రేపు చేస్తానులెండి వెధవ్వేపడం". వాడు ఏవీ ఎరగనట్టు గిన్నెలు డిష్ వాషర్ లో లోడ్ చేసేసి, వక్కపొడి వేసుకుంటున్నాడు. ఇలాక్కాదని రాత్రి వాడికి వంద బంగాళ దుంపల వంటకాలున్న వంటల పుస్తకం ఇచ్చాను. వాడు అరసెకనులో అన్నీ నేర్చేసుకున్నాడు. మర్నాటినించీ నాకు చేసిపెడతాడని తెగ సంబరపడ్డాను. అన్నీమనం అనుకున్నట్టు జరిగితే ఆ దేవుడెందుకు, ఏట్లోదూకను?. మర్నాడింటికొచ్చేసరికి ఘుమఘుమలాడిపోతోంది, బజ్జీల వాసనా, మసాలా వాసనాను. వంటిల్లంతా వెతికాను, పన్నెండు ఖాళీ గిన్నెలు కనపడ్డాయి. ఇంతలో వాడొచ్చాడు. "బాస్, ఇవాళ ఎనిమిది రకాలు చేసుకుతిన్నాను. టూ మచ్ గా ఉన్నాయి. ఇప్పుడే ఫార్మర్స్ మార్కెట్ నించి చిట్టి చిట్టి బంగాళదుంపలు తెచ్చాను. వీటిని పొళంగా వేయిస్తాను, తరవాత లైట్‌గా సీజనింగ్ కొట్టించి, ఓ సినిమా పెట్టుకుని తింటూంటే చూడూ..".

"రేయ్...నువ్వు తినడవేనా, మాకు పెట్టేదుందా?" అరిచాను.

"సారీ బాస్, అరవకండి. మీకు కావస్తే మీరే చేసుకోండి, నేను పడుకున్నాకా." అన్నాడు మొహమాటం లేకుండా.

"నాకు మండిందంటే చిప్పు లాగవతల పారేస్తా.." అన్నాను కసిగా.

"లేదు బాస్, ఒకసారి పెట్టిన చిప్ తీసేస్తే నేను మటాష్ అవుతాను. కావస్తే కొత్తవి తగిలించుకోవచ్చు. అన్నట్టు ఆ రెండో చిప్పు పనిచెయ్యట్లేదు. ఆలోచించుకోండి." అనేసి వంటింట్లో దూరిపోయాడు.

చేసుకున్న బేమ్మడా అనుభవించు అంటూ ఈసురోమని హాల్లోకి పోయా. ఫోను మోగితే ఎత్తాను.

"ఆ, కుమార్ గారూ, డిసెంబరు గురించి ఏవనుకుంటున్నారు?".

నాకర్థం కాలేదు.

"ఖచ్చితంగా నవంబరు 30 తరవాతే వస్తుంది" అన్నాను కాన్ఫిడెంట్‌గా.

"అబ్బా, అదికాదండీ, మరీ..., మరీ.." అంటూ నీళ్ళు నములుతున్నాడు.

"చెప్పండి" అన్నాను దేవాలయం సినిమాలో శోభన్ బాబు లా.

రహస్యంగా అడిగాడు "మీకు ఇంటరెస్ట్ వుందా?".

నాకొక్కసారి గుండె ఆగింది.

" లేదండి, మా పిల్ల మీదొట్టు, నేనస్సలు అలాంటివాణ్ణి కాదండి.." అనేసి ఫోను పెట్టేసాను.

షాకు నించి తేరుకునే లోపులోనే ఇంకో ఫోను.

"ఏయ్, శీనూ, నేను."

"అంటే?"

"అంటే, నే..ను, నీ చిన్నప్పటి క్లాసు మేట్ ని. మర్చిపోయావా ?" అందో ఆడ లేడీసు గొంతు తెగ గారాలుపోతూ.

గుర్తుపట్టలేదు. అయినా గొంతు బావుందని

"ఓ నువ్వా, ఐ మీన్ మీరా, ఏంటి సడన్ గా ఫోను చేసారు?".

"మేము వచ్చేవారం మీ వూరొస్తున్నాం. డిసెంబరొస్తోంది కదా, నీకేవన్నా ఇంట్రెస్ట్ ఉందేమోనని..". (అయ్యబాబోయ్..ఇదేంగోలరా దేవుడో..) .

నేను మాట్లాడే లోపే "ఏవిటా సైలెన్సూ, నేనే మీరా ని. ఉండు మా ఆయనకిస్తా.." అనేసి ఇచ్చేసింది.

ఆయన ఫోనుచ్చుకుని " ఆ, శీనూ గారా, మా ఆవిడ చెప్పింది, మీరిద్దరూ చిన్నప్పుడు క్లాసుమేట్సట కదా..".

"అవునండి. ఒకటి నించి మూడు దాకా చదువుకున్నావండి కలిసి, అంతకు మించి నాకేపాపం తెలియదండి.." అన్నాను ఆందోళనగా.

"అదిసరేనండీ, ఇంతకీ ఇప్పుడు మీకు ఇంటరెస్టు ఉందా? లేదా?"

"తప్పండి, అన్నీ తెలిసిన మీరుకూడా ఇలా అడగటం..".

"అబ్బా, మేం అడిగేది ఎలెక్షన్ల గురించి. ఈ సారి నేను ప్రెసిడెంటుగా వేద్దామనీ.... మరి...అనుకుంటున్నాను. ఆల్‌రెడీ అన్ని పోస్టులకీ దొరికేసారు, మిమ్మల్ని " ఎడ్డుకేషన్ " అనుకుంటున్నాం. మీరు "ఊ" అంటే, పోస్టర్లు అచ్చేయించేస్తాం. ఆనక మీ కులపోళ్ళందరినీ పోగేసి మనకి వోటేయించే పూచీ మీది. "

నాకేవనాలో తెలియలేదు. అందుకే "హలో...హలో...వినబడటం లేదు..హలో.." అనేసి ఫోను పెట్టేసాను.

పట్టరాని ఆనందంతో మేడమీంచి కిందకి దిగుతోంది మా ఆవిడ.

"ఏవిటే సంగతి?" అడిగాను నేను.

"ఇప్పుడు రెండు సబ్బు బిళ్ళలు కొంటే మూడోది ఉచితంటండీ, ఇంక మనకష్టాలన్నీ తీరిపోయినట్టే.." అంది పొంగిపోతూ.

"అవునా, ఎంత చల్లని వార్త చెప్పావే.." అన్నాను యంగ్ గుమ్మడిలా. వెంఠనే ఆవిడ టాపిక్ మార్చి అడిగింది.. " ఎవరూ ఫోను ?"

"ఏమోనే..సరిగ్గా వినపడలేదు.."

"పై ఫోనులో నాకు బానే వినిపించింది..ఎవరీ మీ..రా..? " అంది వెటకారంగా.

"ఏమోనే. ముఫ్ఫైఏళ్ళక్రితం మూడు క్లాసులు చదువుకున్నాం కలిసి. మళ్ళీ ఇప్పుడే మాట్టాడటం. ఎందుకు చేసిందో, ఏమో?" అన్నాను తెలియనట్టు.

"చాల్లెండి అబద్ధాలు. ఇంతకీ మీకు ఇంటరెస్టుందా లేదా?"

"అయ్యిబాబోయ్. తప్పు, లెంపలేసుకో. ఆవిడకి పెళ్ళయిపోయింది. పర నారిః..పర నారిః.. " అంటూ గొణిగాను ఆనక సంస్కృతం కొటేషను గుర్తుకురాక...

"మీ సంస్కృతం మండినట్టే ఉంది గానీ, నేనడిగేది కూడా ఎలెక్షన్ల గురించే..." అంది పక్కనే కూర్చుంటూ.

" అదా, చాల్లే, వళ్ళు కాలి ఒహడేడుస్తుంటే... ... అన్నట్టుగా ఉంది సంబడం..మన వ్యాపకాలకి తోడు ఈ దిక్కుమాలిన ఎలెక్షన్లొకటేవిటీ. ఛస్తే పోటీ చెయ్యను. " అన్నాను ఖరాఖండీగా.

"అవును, ఎన్నాళ్ళు చేస్తారు, ఎడ్డుకేషనూ, లిటరరీ." .

ఇన్నాళ్ళకి నామాటతో ఏకీభవించిన మా ఆవిడని చూసి ముచ్చటేసింది. అప్రయత్నంగా పాట మొదలెట్టేసా.."నువ్వంటే నాకెందుకో, ఇంత ఇదీ..." అంటూ.

నా నోరు మూస్తూ చెప్పింది " నామాట విని ఈసారి మీరు ప్రెసిడెంటుకి నించోండి."

ఒక్కసారి సోఫాలో అంతెత్తుకెగిరి కిందపడ్డాను తల అడ్డంగా ఊపేస్తూ..

"మీరిలాగే భీష్మించుక్కూచోండి. మనకి తెలియా తెలియదూ, చూసన్నా నేర్చుకోమూ. పదహారేళ్ళమట్టీని మట్టికొట్టుకుపోతూ ఉన్నారు ఊళ్ళో. ఏంలాభం ?. నో. ఈ సారి ఎల్లాగన్నా, ఏం చేసైనా మీరు ప్రెసిడెంటు కావలసిందే మా ఫ్రెండ్సంతా అడుగుతున్నారు కూడానూ, ఇంకా ఎప్పుడూ, ఇంకా ఎప్పుడూ అని. ఈ ఏడాది వాళ్ళంతా పిల్లి నడకలూ , పిల్లల ఫాన్సీ డ్రెస్సు పోటీలూ, పెద్ద పిల్లలు లేటెస్ట్ బూతు పాటలకి డేన్సులూ, వాళ్ళ మొగుళ్ళ పాటలూ, అంత్యాక్షరిలూ అన్నీ ప్రిపేర్ అవుతున్నారు. మీరు నెగ్గకపోతే అవన్నీ వేస్ట్.. అయినా మీకేం తక్కువ?" అంది ఆందోళనగా.

"వోట్లు" అన్నాను నీరసంగా.

"అయితే ఆ దిక్కుమాలిన ఓట్లు సంపాదించే ఉపాయం ఆలోచించండి. అంతవరకూ వాడు పడుకున్నాకా కూడా బంగాళదుంపల మాటెత్తడానికి వల్ల కాదు" అనేసి స్లో...మోషన్ లో వెళ్ళి..ళ్ళిపోయింది నిహి..ర్దాక్షిణ్యంగా.

ఏడుపు మొహం పెట్టుకుని బేస్ మెంట్లో కంప్యూటర్ చూస్తున్నాను ఏం చెయ్యాలో తెలియక. ఇంతలో టింగు మని మోగింది. ఈమెయిలొచ్చింది. బాబోయ్ శ్రీధర్ గాడి దగ్గరనించి. ఏదో ఆలోచిస్తూ పొర పాటున ఓపెన్ చేసాను. "ఇక్కడ నొక్కండి" అనే లైను, కింద ఒక లింకుంది. నొక్కాను నా రాత బాగులేక. వెంటనే వాడి గొంతు...

*" మిత్రులారా. ఇది ఇవ్వాళే రాసిన కవిత.*

*"చలి వసంతం" .*

*పూవులు పూసిన కోయిల,*

*పాటలు పాడే కొమ్మలా ( నీ దిబ్బా దిరుగుండంలా..)*

*వణికి వచ్చిన వసంతంలా,*

*కణికి తెచ్చిన హేమంతంలా " .*

నా వల్లకాలేదు. అమాంతం పవర్ ప్లగ్గు పీకేసి, కాసేపు రిలాక్స్ అయ్యాను.

*వాళ్ళ మెంబర్షిప్పు డబ్బులు కూడా కడితేనే గానీ, మన పీనుగులే మనకి ఓటెయ్యరు.* మూలవిరాట్టుకి పువ్వు లేదు, ఉత్సహ విగ్రహానికి ఊరేగింపులని.., అసలు ఓట్లకే దిక్కు లేదు. "పైసలు" వోట్లెలా వేయించుకోవాలిరా నాయనా అని నోస్ పికింగ్ చేస్తూ సీరియస్‌గా థాటింగు చేస్తున్నాను. అలవాటు లేని పని కావడం వల్ల మోకాలినెప్పి మొదలైంది. పైకొచ్చి, దిగాలుగా పడుకుంటూ చెప్పాను "ఒసేయ్, నేను ప్రెసిడెంటు అవ్వాలంటే ఒక్కటే మార్గం. మన వాళ్ళందరినీ పోగేసి కొత్త సంఘం పెట్టుకోడవే.." .

"అలా అయితే ఏం వద్దు. అందరూ ఒకచోటే ఉండి ఉమ్మడిగా కుమ్ముకు ఛస్తే, అదే ఆనందం కానీ, వేరు పడిపోతే ఏం లాభం? మా ఫ్రెండ్స్ ఇలాంటివన్నీ కుదరవని ఆల్‌రెడీ చెప్పేసారు. మీవల్ల కాకపోతే ఏంచేస్తాం, మన రాత ఇంతే అని సరిపెట్టుకుంటాం." అనేసి అటు తిరిగి పడుకుంది. నేనూ ఇటు తిరిగి బజ్జున్నాను ఈసురోమంటూ.

నా బంగాళదుంపలు తిన్న విశ్వాసం పాపం శీనుగాణ్ణి నిలబడ నివ్వలేదు, నించోనివ్వలేదు. తన కేరెక్టర్ డేమేజైపోతుందని తెలిసి తెలిసీ, నాకోసం ఆ మిగిలిన చివరి చిప్పు (రెడ్) తగిలించేసుకున్నాడు. ఒక్కసారి వికటాట్టహాసం చేసాడు. ఇవాళే మెంబర్షిప్పులు చేయించడానికి ఆఖరి తేదీ. ఇప్పుడు కొత్త మెంబర్షిప్పులు చేయించలేం. అయినా సరే, మెంబర్ షిప్ డేటాబేస్ లోకి దొంగతనంగా వెళ్ళి,

నాకోసం మూడువేల మెంబర్లని చేసేసాడు. వాటిలో **మారడోనా, టైగర్ వుడ్సూ, టైసన్నూ, క్లింటన్నూ** లాంటి మహామహుల పేర్లన్నీ ఉన్నాయి. ఆ మర్నాడు శరవేగంతో వెళ్ళి ప్రెసిడెంటు పదవికి నా నామినేషన్ వాడే వేసి వచ్చేసాడు.

ఎలెక్షన్ల తరుణం వచ్చేసింది. అందరూ ఇరవై మైళ్ళ పొడవున్న లైన్లలో నిలబడి, వాళ్ళ వాళ్ళ సామాజిక వర్గం వారికి ఓట్లేసుకుంటున్నారు, వాళ్ళ పేర్లూ , కాంటెస్టు చేసే పోజిషన్లతో సంబంధం లేకుండా.. అందరిలోనూ టెన్షన్. ఓటింగ్ అయ్యేసరికి రెండ్రోజులయింది. కౌంటింగ్ పూర్తయింది. బంపర్ మెజారిటీ తో **నేను** గెలిచాను. గెలవని వాళ్ళు నానా శాపనార్థాలూ పెడుతూ వెళిపోయారు. ఓ **మూడువేలమంది** నాకు బ్రహ్మ రథం పడుతున్నారు. నాకింత ఫాలోయింగు ఉందని అప్పుడే తెలిసింది. గెలిపించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపి, ఈ ఏడాది చేయబోయే **నబూతో నవిష్యతి** వంటి కార్యక్రమాలగురించి వివరించి, నెక్స్ట్ వీక్ కల్చరల్ ప్రోగ్రాంస్ ఎరేంజ్ చేసాను.

ఆ రోజు హాల్లో మూడువేల పైన **వంద మంది.** ఆ వంద మందీ బూతు పాటలకి డేన్సులూ, పాటలూ, ఇల్లా కసి తీర్చుకునే సరికి, నాకు తల ప్రాణం తోకకొచ్చింది. మా ఆవిడ మొదట్లో రెణ్ణిమిషాలు కూర్చుని **"ఎరక్కపోయి అడిగాను, మాయదారి కోరిక, మాయదారి కోరికాని.. వచ్చే ఏడాదంతా భరించాలి ఇంకా... "** అనుకుంటూ కారెక్కి తుర్రుమంది.

ఒకళ్ళ మెడ మీద ఎక్కి ఇంకొకళ్ళు వీడియో కవరేజ్‌లు చేసేస్తున్నారు. ఫొటో గ్రాఫర్లు కాళ్ళమీంచీ, చేతులమీంచీ తొక్కుకుంటూ వెళిపోయి అన్ని కోణాల్లోంచీ ఫొటోలు తీసేస్తున్నారు. నా స్పీచ్ కి మూడువేలమంది లేచి నిలబడి చప్పట్లు కొట్టారు.  ఇదేదో బానే వుందనిపించింది. నెక్స్ట్ ఫంక్షన్ చెయ్యడానికి డబ్బులు కావాలని సభాముఖంగా అడిగాను. **వందమంది మాయం.**

మరేం పరవాలేదు, ఇంకా మూడువేల మందున్నారు. అంతా తలోచెయ్యీ వేస్తే, ఈ ఏడాది ఫండిగ్ అద్దిరిపోతుంది. అనుకుంటూవాళ్ళందరినీ చందాలడిగాను. ఇంతలో బైట జడివాన మొదలయింది. ఎక్కడో పిడుగు పడింది. ఉన్నట్టుండి పవర్ సర్జ్‌లాంటిదేదో అయింది. అంతే...నా ఎదురుగా కూర్చున్న ఒక్కొక్క శాల్తీ టపా టపా మని కింద పడిపోయింది.

మధ్యలో నాలా వున్న ఒక శాల్తీ పడిపోతూ, పోతూ అంది..**"అయాం సారీ, ఇంతమందిని తయారు చెయ్యటంలో బేట్‌రీ పవర్ చూసుకోలేదు..."** . అంతా పడిపోయారు. ఇప్పుడెంతో ప్రశాంతంగా ఉంది. చేసిన సంఘ సేవ చాలనిపించింది. ఇంటికెళ్ళి మంత్రుడు లందరికీ     బేకప్ పవర్ తో  సెల్ఫ్ డిస్ట్రాయ్ ఏక్టివేట్ చేసేసాను. చెప్పకపోడవే, ఈ దిక్కుమాలిన మనుషులకి కూడా ఇల్లాంటి బటన్ ఏదైనా ఉంటే బాగుండుననిపించింది.

**"ఉందోయ్, దాన్నే కులం అనేవారు. ఇప్పుడు సామాజిక వర్గం అంటున్నారు. ఆ బటన్ మీరంతా ఎప్పుడో నొక్కేసుకున్నారు. వెయిట్ అండ్ సీ"** అని పైనించి తెల్ల గెడ్డం నిమురుకుంటూ తాపీగా షో చూపించారు బ్రహ్మ గారు. పైన అందరికీ ఫుల్ కౌంట్లు పడ్డాయి.

****

---

*హమ్మయ్య, ఇరవైనాలుగు అట్లూ  పూర్తయ్యాయి. ఇహ ఇప్పుడు, ఉద్యాపన చేసేసుకుందాం.*

మొదలెట్టినప్పుడు మహా రాస్తే రెండో మూడో రాసి, ఆనక "అబ్బే, కుదరట్లేదండీ కిరణ్‌ప్రభ గారూ, ఆఫీసు లో చాలా వర్క్ ప్రెషరుంటోంది" అని అబద్ధ వాడేద్దామనుకున్నాను, ఆయనెల్లాగూ మా ఆఫీసుకొచ్చి చూడరనే ధైర్యంతో. కానీ మొదలెట్టాకా తెలిసింది, ఇదో వన్ వే ట్రాఫిక్ వ్యవహారమని.

ప్రతినెలా ఏదో ఒహటి రాయడం, ఎవరన్నా మెచ్చుకుంటే, ఛాతీ కుడివైపో అంగుళం, ఎడంవైపో అంగుళం పెరిగిపోవడం, మళ్ళీ మరోటి రాసేయడం, జనాలమీదకొదిలేయడం. పాపం, ప్రపంచంలో ఇంతమంది మొహమాటస్తులున్నారని నాకు జాలి కూడా వేసేసింది, మనసులో ముక్క చెబుతున్నాను.

రెండేళ్ళలో ఇరవైనాలుగు ఎపిసోడ్లు రాసానంటే అదంతా మీ పుణ్యమే. ఎక్కడెక్కడినించో ఎవరెవరో రాసారు, "బావుందనీ, హాయిగా నవ్వుకున్నామనీ, ఇంకా ఇల్లాగే రాస్తూ ఉండమనీ"ని. వాటిల్లో ఎద్దు మైలారం నించి వచ్చిన ఉత్తరాలని మినహాయించుకున్నా, ఇంకా బోలెడు మిగిలేవి, ప్రతీ నెలాను. చెప్పకపోవడమే, నాకూ సంతోషంగా అనిపించేది. మనం అచ్చంగా బంగారం పెట్టినా, కోట్లిచ్చినా మరొహాళ్ళణ్ణి ఛస్తే నవ్వించలేము. వాళ్ళకి నవ్వొ స్తే నవ్వుతారు, దట్సాల్ అండ్ దటీజ్ ఫైనల్. అలాంటిది మీరంతా రెండేళ్ళపాటు నా రాతలకి నవ్వుకున్నారంటే, అంతకు మించిన ఆనందం ఏముంటుంది నాకు?
నా బద్ధకానికి సరైన మందు మీ అందరి ఉత్తరాలూను. కొన్ని కౌముదిలోవి, ఇంకొన్ని నా ఈ మెయిలుకి మీరు పంపినవీ. అవే నన్ను నెల నెలా రాయించాయి. ఇక ఎడిటర్ గారు సరేసరి. "ఫణిగారూ, ఈనెల చాలా బాగా వచ్చిందండీ, నిన్ననే నాలుగు ఉత్తరాలు కూడా వచ్చాయి, అందరికీ తెగ నచ్చేసింది, అవును, మీకు ఏమీ ఇబ్బందిలేదుకదా, కంటిన్యూ చేద్దామంటారా?" అని అమాయకంగా అడిగేసి, ఒకేడాదిని, రెండేళ్ళు చేసేసారు.

ఇప్పుడీ రెండేళ్ళ పంట కాపు కొచ్చింది. ముందే చెప్పినట్టుగా "టేకిటీజీ" పుస్తకం తయారవుతోంది. త్వరలోనే మీ ఇంటికొస్తుంది. మీరు మళ్ళీ చదువుకుని, మీ స్నేహితులచేత చదివించండి.

రాయమని ప్రోత్సహించి, అడుగడుగునా చేయూతనిచ్చిన కిరణ్‌ప్రభగారికీ, బావుందని వెన్నుతట్టి మరీ రాయించుకున్న మీ అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు.

దేవుడు మేలుచేస్తే వచ్చే ఉగాది నాటికి మరో శీర్షికతో కలుసుకుందాం.

*నమస్కారములతో,*

*మీ ఫణి.*

---

"ఎవడ్రానువ్వు?"

*"అంటే..వుప్పుడు,రెండేళ్ళకితం వచ్చినప్పుడు "ఎవడ్రానువ్వు " అని అడిగారు చూడండి,*

వాణ్ణేనండి."

"కాపీ జోకులకేంగానీ, కథేంటో చెప్పు.."

"కథలూ, కబుర్లూ, కాదండి, ఈ సారి కాకరకాయలు.."

"అబ్బో, పేరేం పెట్టేవేటి?

"టేకిట్ ఈజీ అండి.."

"తెలుగు పేరు దొరకలేదా?"

"అంటే.. స్టయిలు గుంటది కదండి మరి.."

"ఓర్నీ స్టయిలూడదొబ్బ , ఇంతకీ కితం పుత్తకానికేమాత్రం సంపాదించావేవిటి?"

"మైనస్ ఎనిమిదొందలండి..."

"రూపాయిలే..?"

"డాలర్లండి.."

"ఇంకా తీరలేదా బులపాటం?"

"ఓ పూట అన్నం మానేసి అర్టిపండు తినేద్దారని డిసైడయ్యానండి.."

"నిన్నా దేవుడు కూడా బాగుచేయలేడు రా .."

"మరేనండి .."

కాబట్టి ఇందు మూలముగా తెలియజేయున దేమనగా... మీరింతకాలమూ గోళ్ళు కొరుక్కుంటూ చదివిన టేకిటీజీ, ఇకపై పుస్తకముగా తీసుకుని వచ్చుటకు దైవజ్ఞులు నిశ్చయించినారు గాన, కొత్త సమచ్ఛరములో అపుడో, ఇపుడో, ఎపుడో టేకిటీజీ 24 ఎపిసోడ్ల పుస్తకముగా మీ ముందుకు వచ్చును. మీరు కాపీలు రిజర్వు చేసుకోదలచినచో, మాకు రాయుడి. ఇవియే అనేక శుభలేఖార్థములు. ఈ మెయిలు: ఫణిడొక్కా ఎట్ యాహూ డాట్ కాం.

(ఒహోం ఒహోం హోం ఒహోం ఒహోం...)

**NEW**
Click here to share your comments on this story